క్లుప్తంగా

ఉపాధి బిల్లులు చెల్లించాలి

జూపాడుబంగ్లా: పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల బిల్లులు వెంటనే చెల్లించాలని సీపీఎం నాయకుడు కర్ల డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఎంపీపీ సువర్ణమ్మను కలిసి వినతి పత్రం అందజేశారు. ఉపాధి పనుల వద్ద కూలీలకు నీడ, తాగునీరు ఏర్పాటు చేయించాలని కోరారు. జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని, దళితవాడల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరారు.

ఆధార్ సెంటర్ తనిఖీ



ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ సుమిత్రమ్మ

పగిడ్యాల: స్థానిక గ్రామ సచివాలయం 1లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ఎంపీడీఓ సుమిత్రమ్మ శుక్రవారం తనిఖీ చేశారు. 6 ఏళ్ల లోపు పిల్లలకు ఆధార్ నమోదు చేసుకోవడానికి ఏర్పాటు చేసిన సెంటర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా ఆధార్ నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఆధార్ నమోదులో తప్పులు లేకుండా చూసుకోవాలని డిజిటల్ అసిస్టెంట్లకు సూచించారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి ఉన్నారు.

అమ్మవారికి కొబ్బరి కాయల సమర్పణ



కొబ్బరి కాయలు సమర్పిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా దేవి అమ్మ వారికి శుక్రవారం కొబ్బరి కాయలు సమర్పించారు. ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపించారు. అనంతరం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో శుక్రవారం రాత్రి ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. కామేశ్వరీ, మహానందీశ్వర ఉత్సవమూర్తులను వేద పండితులు, అర్చకులు విశేషంగా అలంకరించారు. అలంకార మండపంలో గణపతి, అలంకార పూజలు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం వైభవంగా నిర్వహించారు.


భ్రమరాంబాదేవికి ఊయలసేవ



అమ్మవారికి ఊయలసేవ నిర్వహిస్తున్న ఆలయ అధికారి, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామి అమ్మవార్లను ఆసీనులను చేసి షోడశోపచార పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మకు కూడా విశేషపూజలు నిర్వహించారు.

అలరించిన నృత్యప్రదర్శన



నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై సికింద్రాబాద్‌కు చెందిన ఎస్.మృణాలిని వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆనంద నర్తన గణపతిం, శంకరశ్రీగిరి, ఓం నమశివాయ, శివతాండవం తదితర గీతాలకు శ్రావణి, తన్వి, గోవింద్, వేద, గంగాశ్రీ తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

హామీని నెరవేర్చాలి

జూపాడుబంగ్లా: ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేలా అసెంబ్లీలో తీర్మానం చేయాలని రజకసంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు బస్తిపాటి మౌలాలి, మండల అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ఐలమ్మ విగ్రహం వద్ద వారు మాట్లాడారు.

టీకా వేయించు..

వ్యాధులు నివారించు!

రైతన్నల జీవన పోరాటంతో వారికి చేదోడు వాదోడుగా ఉండేది ఎక్కువగా మూగ జీవాలే. అవి శారీక శ్రమతో పాటు ఆర్థికంగా కూడా సాయం చేస్తూ అండగా నిలుస్తున్నాయి. అలాంటి పశువుల ప్రాణాలను కాపాడుకోవడం కూడా రైతన్నల బాధ్యత. ఒంట్లో బాగో లేకపోయినా, ఏ జబ్బో ఆవహించినా మూగజీవాలు కావడంతో చెప్పలేక మృత్యువాత పడుతుంటాయి. అందుకే వ్యాధులు దరి చేరకుండా ముందస్తు టీకాలు వేయించి రక్షించుకోవాల్సిన బాధ్యత అన్నదాతలపై ఎంతో ఉంది.

- అప్రమత్తంగా ఉంటేనే పశుసంపద వృద్ధి
- సీజనల్ వ్యాధుల నివారణకు టీకాలు తప్పనిసరి



గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న పశుసంవర్ధకశాఖ వైద్యులు

జూపాడుబంగ్లా: నియోజకవర్గంలో 21,376 ఆవులు, 35,623 బర్రెలు, 2,16,346 గొర్రెలు, 24,726 మేకలు ఉన్నాయి. వీటిని వ్యాధుల బారిన పడుకుండా రైతన్నలు కాపాడుకోవాలి. తెల్లజాతికి చెందిన ఆవులు, ఎద్దులు, లేగదూడలకు ఎక్కువగా గాలికుంటు, జబ్బవాపు వ్యాధి, నల్లజాతికి చెందిన బర్రెలు, పడ్డలు, దున్నల్లో గొంతువాపు వ్యాధి, గొర్రెలు, మేకలు, పొట్టేళ్లలో చిటికె వ్యాధి వ్యాపించే అవకాశాలున్నాయి. వీటి నివారణకు పశుసంవర్ధకశాఖ అధికారులు ఇప్పటికే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు. రైతన్నలు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలి.

- గాలికుంటు వ్యాధి వ్యాపిస్తే పాడిపశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. ఎద్దుల్లో బరువులెత్తే సామర్థ్యం తగ్గుతుంది. దూడల్లో వ్యాధినిరోధక శక్తి తగ్గి మృత్యువాతపడతాయి. ఈ వ్యాధి వ్యాపించిన పశువుల్లో నోట్లోంచి సొంగరావటం, పశువులు అధిక జ్వరంతో ఊగిపోతాయి. పశు వైద్యులను సంప్రదించి ముందస్తు టీకాలు వేయించుకోవటం తప్పనిసరి.

1902ను సద్వినియోగం చేసుకోవాలి

పశువులు, జీవాలు వ్యాధుల బారిన పడితే అత్యవసర చికిత్స కోసం 1902కు ఫోన్ చేయవచ్చు. సంచార పశువైద్యశాల వాహనం వచ్చి వెంటనే పశువులు, జీవాలకు వైద్యం అందిస్తారు. అవసరమైతే వైద్యశాలలకు తరలించి మెరుగైన వైద్యం అందించి తిరిగి ఇంటి వద్దకు చేర్చుతారు.

- నల్లజాతి పశువులు బర్రెలు, పడ్డలు, దున్నల్లో అధికంగా గొంతువాపు వ్యాధి వ్యాపిస్తుంది. గొంతు కింద భాగం నొప్పులతో కూడిన వాపులుంటాయి. ఊపిరితిత్తుల్లో నిమ్ము చేరుతుంది. ఊపిరి తీసుకోవటం ఇబ్బందికరంగా మారుతుంది. ఆయాసం, గురకతోపాటు తీవ్రమైన జ్వరంతో ఆహారం తీసుకోలేక మృత్యువాతపడే అవకాశాలున్నాయి. రక్త పరీక్షలు చేయించి వ్యాధి నిర్ధారణ తర్వాత చికిత్స చేయించాలి. గొంతువాపు వ్యాధి రాకుండా ఏటా మే, జూన్ మాసాల్లో హెమరేజిక్ సెప్టిసేమియా టీకా వేయించాలి.
- క్లాస్ట్రిడియం పెర్‌ఫ్రిజన్స్ టైపు డి బ్యాక్టీరియా వల్ల జీవాల్లో చిటుక వ్యాధి వ్యాపిస్తుంది. తొలకరి వర్షాలు కురిశాక మొలిచిన లేతగడ్డిని మేసినప్పుడు వాటిల్లో ఉండే బ్యాక్టీరియా క్రిములు జీవుల శరీరంలోకి వెళ్లటం ద్వారా చిటుకవ్యాధి వ్యాపిస్తుంది. నీరసంగా ఉండటం, జ్వరం రావటం, గడ్డితినకపోవటం ఈ వ్యాధి లక్షణాలు. వ్యాధి తీవ్రమై గాల్లోకి ఎగిరి గిలగిలా కొట్టుకుంటూ మృత్యువాత పడతాయి. ఉదయం, మధ్యాహ్న వేళల్లో ఈ వ్యాధి లక్షణాలు జీవాల్లో అధికంగా కనిపిస్తాయి. ముందుజాగ్రత్తగా ఎంటరోటాక్సిమియా టీకాను వేయించాలి.

50 శాతం పశువులకు టీకాలు వేశాం



పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తు టీకాలు వేస్తున్నాం. ఇప్పటికే 50 శాతం పశువులకు టీకా వేసే కార్యక్రం పూర్తయింది. రైతులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. టీకా వేయించడం వల్ల జీవాలకు గాలికుంటు, జబ్బవాపు, గొంతువాపు, చిటుక వ్యాధులు దరి చేరవు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న టీకాలను పశుపోషకులు తప్పనిసరిగా వేయించాలి.

– రామాంజనేయనాయక్, పశుసంవర్ధకశాఖ ఏఈ, జూపాడుబంగ్లా

- తెల్లజాతి పశువులు ఆవులు, ఎద్దులు, లేగదూడలకు జబ్బవాపు వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి వ్యాపించిన పశువుల జబ్బ, వెన్ను, తొడ తదితర కండ ఉన్న శరీరభాగాల్లో నల్లటి వాపు కనిపిస్తుంది. ఈ వాపును చేతితో నొక్కినప్పుడు బుడగ మాదిరి శబ్దం వస్తుంది. జ్వరం రావటంతో మేత మేయకపోవటం, కదలలేకపోవటం, కడుపునొప్పి వంటి లక్షణాలుంటాయి. సకాలంలో చికిత్స చేయించకపోతే రెండు నుంచి నాలుగు రోజుల్లో మృత్యువాత పడే అవకాశాలున్నాయి. జబ్బవాపు రాకుండ బ్లాక్‌క్వార్టర్ టీకా వేయించాలి. వ్యాధిబారిన పడి పశువులకు పెన్సిలిన్ ఇంజెక్షన్లతో పాటు సెలిన్‌బాటిళ్లు పెట్టించాల్సి ఉంటుంది.

సమావేశాలకు పిలవాలని తెలియదా ?

- ఎంపీపీ సువర్ణమ్మ ఆగ్రహం



ఐసీడీఎస్ ఏడీసీపీఓపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ సువర్ణమ్మ

జూపాడుబంగ్లా: ప్రజాప్రతినిధులను సమావేశాలకు పిలవాలని తెలియదా అంటూ ఎంపీపీ సువర్ణమ్మ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్యసమావేశంలో ముందుగా అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం పలువురు సభ్యులు సమస్యలను లేవనెత్తారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలు అరికట్టామని, పి.లింగాపురం, పారుమంచాల గ్రామాల్లో నాటుసారా విక్రయదారులపై కేసులు నమోదు చేశామని ఎక్సైజ్‌శాఖ హెడ్‌కానిస్టేబుల్ శంకరయ్యనాయక్ మాట్లాడుతుంగా జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వరరెడ్డి కల్పించుకుని ఒక్కో గ్రామంలో ఐదారు బెల్ట్ దుకాణాలు పెట్టి నీళ్లకంటే అధ్వానంగా మద్యం విక్రయిస్తున్నా పట్టించుకోరా అంటూ నిలదీశారు. ఖరీఫ్, రబీలో దెబ్బతిన్న పంటలకు బీమా వర్తింపజేయాలని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. రబీలో పండించిన కందులు, శనగలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపీకృష్ణ, ఐసీడీఎస్ ఏసీడీపీఓ మంగవల్లి, తాగునీటిశాఖ ఏఈ నాగేంద్ర, హౌసింగ్ ఏఈ జ్యోతి పాల్గొన్నారు.

కుల గణన చేయకుండా ఎస్సీ వర్గీకరణ తగదు



మాట్లాడుతున్న మాలమహానాడు జేఏసీ నాయకులు

నందికొట్కూరు: కుల గణన చేయకుండా ఎస్సీ వర్గీకరణ చేయడం తగదని అఖిల భారత మాలమహానాడు జేఏసీ నాయకులు శివప్రసాద్, డాక్టర్ రాజు అన్నారు. శుక్రవారం జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ, టీడీపీ, జనసేన ఎస్సీలను విభజించి పాలించేందుకు కుట్ర పన్నినా తిప్పి కొట్టేందుకు మాలలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణ చేసినా నిలవదన్నారు. త్వరలోనే నందికొట్కూరులో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి మాలల గళం వినిపిస్తామన్నారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, తమ్మడపల్లె ఏసేపు, పుల్లన్న, నాగరాజు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం



మద్యం చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

నందికొట్కూరు: అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు తెలిపిన వివరాలు.. నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో తొప్పెట జాన్ వద్ద 12 మద్యం సీసాలు, జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామానికి చెందిన వడ్డే వెంకటేశ్వర్లు నుంచి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు. సోదాల్లో ఎస్‌ఐలు మారుతిప్రసాద్, జహ్రుల్లా, పోలీసులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

కొత్తపల్లి: ఎస్సీ, ఎస్టీ కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎన్ స్వాములు, శివపురం గ్రామ శాఖ కార్యదర్శి పి.సత్యరాజు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శివపురం గ్రామంలో వారు పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్లు, మురుగు కా లువలు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం భరత్, పి ధర్మరాజు, పి చిన్నచిన్నయ్య, కాలనీ ప్రజలు వెంకటమ్మ, ప్రకాషమ్మ, వెలుగమ్మ, కమలమ్మ, కరుణమ్మ, జయమ్మ, గుండమ్మ, అకిరయ్య, స్వాములు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన శిక్షణ

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోషణ్‌బీ–పడాయిబీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండో రోజూ కూడా శిక్షణ కార్యక్రమం కొనసాగింది. సూపర్‌వైజర్లు అంజలి, సూర్యకుమారి తదితరులు పాల్గొని శిక్షణ ఇచ్చారు. నవచేతన కార్యక్రమంలో భాగంగా తల్లి గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు మూడో సంవత్సరం వచ్చేంతవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శివకుమారి, రమాదేవి, కవిత, కోమలి, వినోలియా, కుమారి పాల్గొన్నారు.

- నందికొట్కూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపట్టిన పోషణ్‌బీ – పడాయిబీ పథకం పకడ్బందీగా అమలు చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం మిడుతూరు మండల కేంద్రంలో ఉర్దూ పాఠశాలలో పోషణ్‌బీ – పడాయిబీ కార్యక్రమం ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రీ స్కూల్‌లో నాన్ ఫార్మల్ విద్యను మెరుగు పరచాలన్నారు. చిన్నారుల శారీరక, మానసిక, విద్యాపరమైన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పోషణ, పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు.

'సూపర్ సిక్స్' అమలు చేయాలి

పగిడ్యాల: ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలను అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పక్కీర్‌సాహెబ్ విమర్శించారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాలనీలలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలను గాలికొదిలి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తుండటంతో అన్ని వర్గాల ప్రజలు విసులు చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగరాజు, మద్దమ్మ, కుమార్, శ్రీనివాసులు, ప్రభావతి, పుల్లమ్మ, పుష్పావతి, చెంచమ్మ, ప్రమీలమ్మ, సత్యవతి ఉన్నారు.

భ్రామరికి పట్టువస్త్రాలు సమర్పణ



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న వ్యాపార సంఘం నాయకులు

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి శ్రీశైలం వ్యాపారాల దుకాణాల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. స్థానిక వ్యాపారులు తీసుకువచ్చిన పట్టువస్త్రాలకు అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో వ్యాపార సంఘం నాయకులు శ్రీనివాసరెడ్డి, రమణ, పొట్టి నాగేశ్వరరావు, అర్పీ అరవింద్‌సింగ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

జూపాడుబంగ్లా: చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ ఏసీడీపీఓ మంగవల్లి తెలిపారు. పోషణ్‌బీ–పడాయిబీ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు కేజీబీవీలో అంగన్‌వాడీ వర్కర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బొమ్మలు, ఆటలు, పాటల ద్వారా చిన్నారుల్లో అక్షరాభ్యాసంపై ఆసక్తి కలిగించాలన్నారు. చిన్నారులకు అందించాల్సిన పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. పిల్లల పెరుగుదలతో పాటు వారి మానసిక పరిపక్వత, భాషాభివృద్ధిపై దృష్టిసారించాల్సి ఉంటుందన్నారు. సూపర్‌వైజర్ నిర్మలమ్మ పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

జూపాడబంగ్లా: ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కన్వీనర్ లాజరస్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని జగనన్న కాలనీలో ఆక్రమణ గురైన ప్రభుత్వ స్థలాన్ని పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. పార్టీ నాయకులు ఏసన్న, మద్రిస్వామి, శ్రీనివాసులు, చిన్నకుమార్ ఉన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ మద్దతు

ఆత్మకూరు: ఈనెల 24, 25 తేదీల్లో జరిగే ఆల్ ఇండియా బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని యూనియన్ పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, నాయకులు డి.రామ్‌నాయక్, ఎ.సురేంద్ర, షేక్ ఇస్మాయిల్, వీరన్న తెలిపారు. శుక్రవారం వారు యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలన్నారు. తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బండిఆత్మకూరు: బండిఆత్మకూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ దాక్షాయని తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 6వ తరగతి, ఇంటర్‌లో తరగతులకు 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పేద ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థినులు ఏప్రిల్ 11లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉపవాస ప్రార్థనలు

పాములపాడు: స్థానిక సీఎస్ఐ చర్చిలో శుక్రవారం భక్తులు ఉపవాస ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ సందర్భంగా రెవరెండ్ పాస్టర్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ అతి పవిత్రంగా ఆచరించే దినాల్లో క్రైస్తవులు యేసుక్రీస్తు శ్రమలను గుర్తిస్తూ 40 దినములు ఉపవాస దీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈస్టర్‌కు ముందు నిర్వహించే ఈ ఉపవాస దినాల వల్ల ప్రభువు దీవెనలు పొందుతారన్నారు.

విద్యుత్ అదనపులోడుకు 50 శాతం రాయితీ

వెలుగోడు: గృహ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు విద్యుత్ ఏఈ రవీంద్ర నాయక్ తెలిపారు. కిలోవాటుకు డెవలప్‌మెంట్ చార్జీలు రూ.2000 చెల్లించాల్సి ఉండేదన్నారు. ప్రస్తుతం 50 శాతం రాయితీతో రూ.1,000 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశం జూన్ 30 వరకు ఏపీఎస్పీడీసీఎల్ వెబ్ సైట్ లేదా విద్యుత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సెక్యూరిటీ డిపాజిట్‌లో ఎలాంటి మార్పు ఉండదన్నారు.

పైప్ లైన్లకు మరమ్మతులు

పాములపాడు: మండలంలోని క్రిష్ణారావు పేట గ్రామంలో శుక్రవారం పైపు లైన్లకు సర్పంచు వరప్రసాద్ మరమ్మతులు చేయించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగు నీటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు.



అడవుల ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

అడవులను సంరక్షించుకుందాం

కొత్తపల్లి: అడవులను సంరక్షించుకుందామని ఆత్మకూరు పారెస్టు రేంజ్ అధికారి రామకోటి అన్నారు. శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కళాజాతా ద్వారా అడవుల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు మానవాళి మనుగడకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. కలపతోపాటు, పండ్లు, విత్తనాలు, వేర్లు తదితర వాటిపై లక్షలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. వాటిని మనం రక్షించుకుంటేనే మనల్ని అవి రక్షిస్తాయన్నారు. అడవులను నరకడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా అడవులు – ఆహారం నినాదంతో అటవీ శాఖ పనిచేస్తోందన్నారు. అనంతరం కళాజాతా ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌ఓలు శివనాగయ్య, మహేశ్వరమ్మ, కొలనుభారతి ఎఫ్‌బీఓ క్రిష్ణకాంత్, హెచ్ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు



బండి ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్

పాములపాడు: పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు పాములపాడు మండల కేంద్రంలోని 2 పరీక్షా కేంద్రాల్లో 100 శాతం విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరెండెంట్లు సిద్దయ్య, మాధురి తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఎంఈఓ 2 సుభాషిణీ దేవి తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు పుల్లయ్య, రామ్మోహన్, రామచంద్ర రాయుడు, చంద్రుడు, వెంకటేశ్వర్లు, గణేష్, వెంకటస్వామి శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు.

- కొత్తపల్లి: పదో తరగతి పరీక్షకు శుక్రవారం మండలంలో 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణాధికారులు వెంకటరమణ ఆచారి, వెంకటశివుడు తెలిపారు. కొత్తపల్లి పరీక్షా కేంద్రంలో 171 మందికి గాను 167 మంది, గోకవరం పరీక్షా కేంద్రంలో 86 మందికి గాను 79 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. పరీక్షా కేంద్రాలను ఎంఈఓ–2 ఇనాయతుల్లా తనిఖీ చేశారు.
- బండిఆత్మకూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ పద్మావతి తనిఖీ చేశారు.
- మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురం మోడల్ స్కూల్‌లో ఏడుగురు, గాజులపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు, క్రీస్తు జ్యోతి పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ రామసుబ్బయ్య తెలిపారు.

వెంకటస్వామి సేవలు మరవలేనివి



వెంకటస్వామి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నందికొట్కూరు: యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి సేవలు మరవలేనివని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మూర్తుజావలి అన్నారు. శుక్రవారం సంతపేట పాఠశాలలో వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వాసు, తిరుమలయ్య, జగదీష్, శ్రీను, తిక్కస్వామి, రాముడు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపు పరిశీలన

పాములపాడు: మండలంలోని యర్రగుడూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ క్యాంపును ఎంపీడీఓ చంద్రశేఖర్ పరిశీలించారు. ఆధార్ కార్డు నమోదులో తప్పులు లేకుండా చూసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. అనంతరం ఇస్కాల గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపట్టీని పరిశీలించారు.

కేసీ కాల్వలో తగ్గిన నీటిమట్టం

జూపాడుబంగ్లా: సుంకేసుల డ్యాం నుంచి నీటిసరఫరా నిలిచిపోవటంతో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి మాత్రమే కేసీ కాల్వకు సాగు నీరు సరఫరా చేస్తున్నారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కాల్వకు 735 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తుండగా లాకిన్సేలా వరకు 600 క్యూసెక్కుల నీరు చేరుతుంది. నిప్పులవాగుకు 575క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌చానల్‌కు 25 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు.

క్రైస్తవ సోదరులకు అన్నదానం

ఆత్మకూరు: పట్టణంలోని ఇందిరానగర్ సీఎస్ఐ చర్చిలో ఈస్టర్ పర్వదినం పురస్కరించుకుని 40 రోజుల పాటు ఉపవాస ప్రార్థనలో ఉన్న క్రైస్తవ సోదరసోదరీమణులకు అన్నలదాస్ సారమ్మ కుటుంబ సభ్యులు శుక్రవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్థానికులు ప్రసన్నకుమార్, విజయ్‌కుమార్, అజయ్, దావీదు, రూతమ, మేరమ్మ, మార్థమ్మ, జగన్, మేఘన పాల్గొన్నారు.